జై భజరంగ భళి

- భక్తులకు కొండంత అండ ఆంజనేయుడు
- నేడు హనుమజ్జయంతి ఉత్సవాలు

ఆంజనేయుడంటే భక్తులకు కొండంత అండ. రెట్టించిన ధైర్యం. హనుమంతుడి గుండెల్లో శ్రీరామచంద్రుడు కొలువై ఉన్నట్టుగానే.. భక్తుల హృదయాల్లో భజరంగ భళి స్థానం పొందాడు. నాడు మహాభారత కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునుడి రథంపై 'జెండాపై కపిరాజులా' ఉంటూ విజయ తీరాలకు చేర్చిన హనుమంతుడు.. నేడు ప్రతి ఊరిలో వెలిసి భక్తుల పాలిట ఆపద్బాంధవుడిలా పూజలందుకుంటున్నాడు. ఈ నెల 14న హనుమజ్జయంతిని పురస్కరించుకుని నగరంలో వెలసిన హనుమంతుని భారీ విగ్రహాల్లో కొన్నింటి విశిష్టత తెలుసుకుందాం.

– విశాఖపట్నం డెస్క్

శ్రీ ఆంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 27 అడుగులు
ప్రాంతం: మెయిన్ రోడ్డు, పూర్ణామార్కెట్
నిర్మాణ కర్తలు: దేవాలయ నిధులు, దాతలు
విగ్రహావిష్కరణ: 2006లో నాటి ఎమ్మెల్యే దివంగత ద్రోణంరాజు శ్రీనివాస్ చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించారు.
ప్రాముఖ్యత: ఈ ఆలయ నిర్మాణానికి సంబంధించి ఎన్నో ఏళ్ల చరిత్ర ఉంది. ఈ ప్రాంతంలో ఆంజనేయ స్వామి స్వయంగా వెలిశాడని ప్రతీతి. భక్తుల పాలిట కల్పతరువుగా స్వామి పూజలు అందుకుంటున్నాడు.

సంజీవ ఆంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 30 అడుగులు, (గ్రౌండ్ లెవెల్ నుంచి 40 అడుగులు)
ప్రాంతం: హనుమంతవాక జంక్షన్
నిర్మాణ కర్తలు: జీవీఎంసీ
ప్రాముఖ్యత: విశాఖలో హనుమంతవాకకు ఎంతో ప్రత్యేకత, విశేష చరిత్ర ఉంది. నగరానికే తలమానికమైన ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం కైలాసగిరి.. ఇక్కడి కొండ మీదే ఉంది. ఈ ప్రాంతానికి గుర్తింపుగా మేయర్ గొలగాని హరివెంకటకుమారి సూచనల మేరకు జీవీఎంసీ ఈ విగ్రహాన్ని నిర్మిస్తోంది.
ప్రారంభం ఎప్పుడంటే..?: ఈ విగ్రహం నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. రెండు నెలల్లో పెయింటింగ్‌తో సహా మొత్తం పనులన్నీ పూర్తి చేసి ప్రారంభించనున్నారు.

అభయాంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 16 అడుగులు(గ్రౌండ్ లెవెల్ నుంచి 21 అడుగులు)
ప్రాంతం: జ్ఞానాపురం పాత లారీ స్టాండ్
నిర్మాణ కర్తలు: జ్ఞానాపురం పాత లారీ స్టాండ్ వర్తక సంఘం సభ్యులు
విగ్రహావిష్కరణ: 1990లో విశాఖపట్నం లారీ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఆవిష్కరించారు.
ప్రాముఖ్యత: లారీ స్టాండ్ డ్రైవర్లు సుదూర ప్రాంతాలకు వర్తక, వ్యాపారాల నిమిత్తం రాకపోకలు సాగించేటప్పుడు అభయాంజనేయ స్వామి విగ్రహానికి పూజలు చేసి బయలుదేరుతారు. తిరుగు ప్రయాణంలో వచ్చిన తర్వాత మళ్లీ ఆంజనేయ స్వామిని కొలుస్తారు. ప్రస్తుతం ఈ లారీ స్టాండ్‌ను షీలానగర్‌కు మార్చారు.

జింక్ ఆంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 45 అడుగులు
ప్రాంతం: గాజువాక ఆర్టీసీ డిపో వద్ద జింక్ స్థలంలో..
నిర్మాణ కర్తలు: దేవదాయ శాఖ
విగ్రహావిష్కరణ: ఈ విగ్రహాన్ని 2006లో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి తండ్రి తిప్పల దయాల్‌రెడ్డి ఆవిష్కరించారు
ప్రాముఖ్యత : పారిశ్రామిక ప్రాంతంలో ఇదే ఎత్తయిన హనుమంతుడి విగ్రహం. గాజువాక ఆర్టీసీ డిపో ప్రాంతంలో ఆలయ నిర్మాణానికి ముందు ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగేవని.. ఆలయాన్ని నిర్మించి ప్రారంభించిన అనంతరం ప్రమాదాలు తగ్గాయని భక్తులు చెబుతున్నారు.

అభయాంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 108 అడుగులు
ప్రాంతం: సీతమ్మధార కొండవాలు
నిర్మాణ కర్తలు: శ్రీ హనుమాన్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ ట్రస్టీ అల్లూరి సత్యనారాయణరాజు (ఎ.ఎస్.ఎన్.రాజు), దాతలు
విగ్రహావిష్కరణ: 2021 డిసెంబర్ 8న పెందుర్తి శారదా పీఠాధిపతి స్వరూప నందేంద్ర సరస్వతీ మహాస్వామి చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించారు.
ప్రాముఖ్యత: సీతమ్మధార కొండవాలు ప్రాంతంలోని సువిశాల సుందర ప్రదేశంలో నిర్మించిన 108 అడుగుల ఈ భారీ ఆంజనేయ విగ్రహం విశాఖలోనే అత్యంత పెద్దది.. ఎత్తయినది. ఆధ్యాత్మికంగా నగరానికి వన్నెతెచ్చింది.

మాతాభయ ఆంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 28 అడుగులు
ప్రాంతం: ఓల్డ్ డైరీ ఫారం జంక్షన్
నిర్మాణ కర్తలు: మాతాభయ ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ పెద్ద, ధర్మకర్త బోను సత్యనారాయణ
విగ్రహావిష్కరణ: 2006లో ఆలయ ధర్మకర్త, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఆవిష్కరించారు.
ప్రాముఖ్యత: జాతీయ రహదారిపై పాత డైరీ ఫారం జంక్షన్‌లో వెలసిన మాతాభయ ఆంజనేయుడు భక్తుల నుంచి విశేష పూజలు అందుకుంటున్నాడు. విగ్రహ నిర్మాణంతో ఈ ప్రాంతానికి ఎంతో గుర్తింపు వచ్చింది. ఇక్కడి స్వామిని కనులారా దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. చక్కని వాతావరణంలో ఆధ్యాత్మికతతో ఈ ప్రాంతం నిండి ఉంటుంది.

సుందర అభయాంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 46 అడుగులు(గ్రౌండ్ లెవెల్ నుంచి 57 అడుగులు)
ప్రాంతం: తాటిచెట్లపాలెం జాతీయ రహదారి
నిర్మాణ కర్తలు: ఆలయ కమిటీ సభ్యులు
విగ్రహావిష్కరణ: 1996 మార్చి 7న నాటి మాజీ ఎమ్మెల్యే, వుడా మాజీ చైర్మన్ దివంగత టి.సూర్యనారాయణరెడ్డి చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించారు.
ప్రాముఖ్యత: సుందర అభయాంజనేయ స్వామి భారీ విగ్రహ నిర్మాణాన్ని 1991లో పెద్దాపురం ప్రాంతానికి చెందిన పిండి కృష్ణ అనే శిల్పి ప్రారంభించారు. మరుసటి ఏడాది ఆయన మరణించడంతో ఆ బాధ్యతను ఆయన అల్లుడు రాజ్‌కుమార్ తీసుకుని భారీ విగ్రహం, ఆలయ నిర్మాణాలను పూర్తి చేశారు. నాడు నిర్మానుష్యంగా ఉండే తాటిచెట్లపాలెం ప్రాంతంలో ఆధ్యాత్మికంగా వెలుగొందేలా.. ఓ ల్యాండ్ మార్క్‌లా నిలిచేలా ఈ విగ్రహాన్ని నిర్మించారు. ఎందరో భక్తులు ఇక్కడికి తరలివచ్చి అంజన్నను తిలకించి తరిస్తుంటారు.

క్లుప్తంగా

ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం



స్రవంతి, చరణ్, చరితార్థ్

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ గృహిణి తన ఇద్దరి పిల్లలతో కలిసి అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసుల తెలిపిన వివరాలిలా.. స్రవంతి అనే మహిళ తన భర్త ఎస్.అరుణ్‌కుమార్‌తో కలిసి మన్యం మాధవధారలో నివసించేది. వీరికి వివాహమై ఏడేళ్లయింది. ఇద్దరు పిల్లలు. భర్తతో మనస్పర్థలు రావడంతో పిల్లలు చరణ్(6), చరితార్థ్(4)లను తీసుకుని గత నెల ఏప్రిల్‌లో ఇల్లు విడిచి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ తెలియకపోవడంతో స్రవంతి తండ్రి రాజు కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో ఎస్ఐ సమీర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవ వేంకటేశ్వరుడికి విశేష పూజలు



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

తాటిచెట్లపాలెం: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య వేద పండితులు ఆలయ ప్రదక్షిణ చేసి స్వామికి సుప్రభాతం సేవ చేశారు. అనంతరం తొలి నైవేద్యంగా నివేదన చేసిన గోక్షీరం, మీగడ, వెన్న, పళ్ల ప్రసాదంగా అందజేశారు. ఈ సేవలను దర్శించిన భక్తులు ఆనంద పరవశులయ్యారు. మధ్యాహ్నం 12 గంటలకు బండారు వెంకట కామేశ్వరరావు, అరుణ దంపతుల ఆర్థిక సాయంతో అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. పూజా కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ పర్యవేక్షించారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం



పేపర్ ఫోల్డింగ్‌తో వివిధ ఆకృతులు చేసి చూపిస్తున్న గణిత ఉపాధ్యాయుడు

తాటిచెట్లపాలెం: మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. కార్యక్రమంలో భాగంగా శనివారం విద్యార్థులతో కథలు చదివించి, పురాణాల కథలు చెప్పించారు. గణిత ఉపాధ్యాయుడు ఎం.శంకరరావు ఓరిగామి పేపర్ ఫోల్డింగ్‌తో జంతువులు, పువ్వులు, పక్షులు ఎలా తయారు చేయాలో నేర్పించారు. న్యూస్ పేపర్‌తో కప్పు చేయడం చేసి చూపించారు. గ్రంథాలయ అధికారి వై.పద్మజ మాట్లాడుతూ వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ ఇటువంటి విషయాల్లో పిల్లలు రాణించాలని సూచించారు. అనంతరం పిల్లలకు చాక్లెట్లు, బిస్కట్లు పంపిణీ చేశారు.

నేటి నుంచి బంగారమ్మ, పోలమాంబ ఉత్సవాలు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 28వ వార్డులో వెలసిన బంగారమ్మ, పోలమాంబ ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభంకానున్నాయి. పితాని దిబ్బలో వెలసిన బంగారమ్మ పండగ మహోత్సవాలు ఈ నెల 14 నుంచి 16 వరకు సాంస్కృతిక కార్యక్రమాలతో వైభవంగా నిర్వహించనున్నారు. ఆదివారం పండగ చాటింపు, సోమవారం తొలేళ్ల ఉత్సవం, మంగలవార ప్రధాన పండగ జరుగుతాయి.

- గొల్లలపాలెం గ్రామ ప్రజల ఆరాధ్య దైవం పోలమాంబ పండగ మహోత్సవాలు ఈ నెల 14 నుంచి 16 వరకు ఘనంగా నిర్వహించనున్నారు. ఆదివారం చాటింపు, సోమవారం తొలేళ్ల ఉత్సవం, మంగళవారం అనుపు కార్యక్రమం జరపనున్నారు. ప్రధాన పండగ మంగళవారం రోజున భారీ ఊరేగింపు నిర్వహించనున్నారు. 23న మారువారం పండగ, వచ్చే నెల 4న ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నదానం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

కామెడీ వర్క్‌షాప్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నరవ ప్రకాశరావు తదితరులు

ఎంవీపీకాలనీ : వేసవి సెలవుల నేపథ్యంలో బాలలకు ఆటవిడుపుగా కామెడీ అంశంపై ఉచిత శిక్షణ అందించనున్నట్లు బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నరవ ప్రకాశరావు వెల్లడించారు. దీనికి సంబంధించిన గోడపత్రికను శనివారం ఎంవీపీ కాలనీలోని వీఎంసీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువుతో పాటు ఆట విడుపుగా ఇతర యాక్టివిటీల్లోను ప్రోత్సహించాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 17 నుంచి 19 వరకు ఈ ఉచిత శిక్షణ కొనసాగుతుందన్నారు. 14 నుంచి 20 ఏళ్ల మధ్య బాలలు ఈ శిక్షణకు అర్హులన్నారు. ఆసక్తి గల వారు 92905 73289 నంబర్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఎంసీ కళాశాల ప్రిన్సిపల్ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ మహిళా ప్రాంగణాల సందర్శన



డీఆర్‌డీఏ మహిళా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

దాబాగార్డెన్స్: జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ శనివారం ఆరిలోవ, పెందుర్తి ప్రాంతాల్లోని డీఆర్‌డీఏ మహిళా ప్రాంగణాలు సందర్శించారు. శిక్షణ సమయంలో వారికి కావల్సిన మౌలిక వసతులతో పాటు భోజనం, తదితర వసతులపై కమిషనర్ ఆరా తీశారు. మహిళలు ఉత్తమ శిక్షణతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని శిక్షణ పొందుతున్న ఏఎన్ఎంలకు సూచించారు. శిక్షణలో ప్రావీణ్యం పొంది ప్రజలకు మెరుగైన సేవలు అందివ్వాలన్నారు. అదనపు కమిషనర్ డాక్టర్ వై. శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్లు కనకమహాలక్ష్మి, మల్లయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటర్ పరీక్షలకు రెమిడియల్ తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అందిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ సుజాత్ తెలిపారు. లయన్స్‌క్లబ్ సహకారంతో ఈనెల 22వ తేదీ వరకూ నిర్వహించే ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులందరికీ భోజనం అందిస్తున్నారన్నారు. ఈమేరకు లయన్స్ క్లబ్ ప్రతినిధులకు ప్రిన్సిపాల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగమణి, అధ్యాపకులు సన్యాసి నాయుడు, ఆర్.పి.నాయుడు, విమల, పుష్పలత, ఇందిరలతోపాటు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు చెరుకూరి శ్రీరామమూర్తి, చక్కా చందనలు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే జగనన్న లక్ష్యం



సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందిస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్

మర్రిపాలెం: ప్రజా శ్రేయస్సే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 50వ వార్డు 278 సచివాలయం పరిధిలోని మురళీనగర్–2 ప్రాంతాల్లో శనివారం సాయంత్రం కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను వివరిస్తూ, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు ప్రజా శ్రేయస్సు కోసం ప్రతిక్షణం పాటుపడుతున్నారన్నారు. ప్రజల అందరి దీవెనలు, సహకారం ఎల్లవేళలా ఆయనపై ఉండాలని కోరారు. 2024లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నే కొనసాగుతారని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, జేసీఎస్ మండల కన్వీనర్ పైడి కృష్ణారావు మాస్టర్, అమర్ రెడ్డి, 50వ వార్డు నాయకులు బగాతి లక్ష్మి, వెంకటరావు, శివరాం ప్రసాద్, వేణు, పాతపట్నం రామ్మోహన్, సనపల నారాయణస్వామి, పొన్నాడ అప్పారావు మాస్టర్, మురళీధర్, ధనంజయ్, షేక్ బాబ్జి, చిరంజీవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సహస్ర చండీ పారాయణం



సహస్రచండీ పారాయణం నిర్వహిస్తున్న భక్తులు

బీచ్‌రోడ్డు: లోక కల్యాణార్థం అమృతానంద నాథ సరస్వతి దివ్య ఆశీసులతో, శ్రీవేణి మాత పర్యవేక్షణలో సహస్రచండీ పారాయణ, హోమం ఘనంగా నిర్వహించారు. శనివారం ఆర్కేబీచ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన 1,200 మంది భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం సహ ప్రచండీ పారాయణాన్ని శ్రీవేణి మాత చేపట్టారు. సాయంత్రం వేద పండితులతో చండీ హోమం నిర్వహించారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్

కొమ్మాది: వేసవి సెలవులను పిల్లలు సద్వినియోగం చేసుకునేలా జ్ఞానాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తోంది సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ సంస్థ. వేసవి సెలవుల్లో వినోదంతోపాటు విజ్ఞానాన్ని, ఆధ్యాత్మిక భావాన్ని చిన్నారుల్లో నింపేందుకు కృషి చేస్తోంది. గత 15 ఏళ్ల నుంచి ఏటా వేసవి సెలవుల్లో చిన్నారులకు మాతాజీ నితాయి సేవిని ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. చిన్నారులకు రామాయణ, మహాభారత, భాగవతం గ్రంథాల సారాంశాన్ని, అందులోని పాత్రల లక్షణాలు వివరిస్తున్నారు. శిబిరం ఈ నెల 22 వరకు నిర్వహిస్తామని మాతాజీ నితాయి సేవిని పేర్కొన్నారు.

హనుమజ్జయంతికి సిద్ధం



విద్యుద్దీపాలంకరణలో తాటిచెట్లపాలెం సుందర అభయాంజనేయ స్వామి ఆలయం

తాటిచెట్లపాలెం: జాతీయ రహదారిపై 45వ వార్డు తాటిచెట్లపాలెంలోని సుందర అభయాంజనేయ స్వామి ఆలయం ఆదివారం జరగనున్న హనుమజ్జయంతి వేడుకలకు సిద్ధమైంది. ఆలయంలో వేకువ జాము నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో చూడచక్కగా ముస్తాబు చేశారు.

పూజా కార్యక్రమాల వివరాలు

ఆలయంలో ఉదయం 5 గంటల నుంచి స్వామికి పంచామృతాభిషేకాలు, 7 గంటల నుంచి సింధూర అర్చన, అభిషేకాలు చేస్తారు. ముందుగా ఆలయ ధర్మకర్తలు నడిమింటి సీతారామారావు, జయలక్ష్మి, రాపేటి గోవింద్, రాజ్యలక్ష్మి, ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆళ్ల మధుసూదన నరసింగరావు, షణ్ముఖేశ్వరి దంపతుల చేతుల మీదుగా విశేష పూజా కార్యక్రమాలను ప్రారంభిస్తారు. ఈ నెల 23న రాపేటి గోవింద్, రాజ్యలక్ష్మి దంపతుల సహకారంతో మహా అన్నదానం నిర్వహించనున్నట్లు ఆళ్ల మధుసూదన నరసింగరావు తెలిపారు.

ఆలయ విశేషాలు..: 1990ల్లో తాటిచెట్లపాలెం నిర్మానుష్యంగా ఉండేది. ఈ ప్రాంతంలో సుమారు 88 ఇళ్లతో తారకరామానగర్ ఆవిర్భవించింది. అప్పటి విశాఖపట్నం–2 ఎమ్మెల్యే టి.సూర్యనారాయణరెడ్డి ఈ కాలనీని మంజూరు చేయించారు. 1991లో ఇక్కడ ఏర్పాటు చేసిన ఒక్కో ఇంటికి ఒక సిమెంట్ బస్తా, రూ.300 చందాలు వేసుకుని 25 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని నిర్మించాలని నాడు తలంచారు. కార్యాచరణకు వచ్చేసరికి విగ్రహం ఎత్తు పాదాల నుంచి 45 అడుగులకు చేరింది. భూమి నుంచి సుమారు 13 అడుగుల మండపం నిర్మించి, ప్రారంభించారు. 1991 చివరలో నిధుల కొరత వల్ల విగ్రహ నిర్మాణం సుమారు మూడేళ్ల పాటు ఆగిపోయింది. 1994లో ఎయిర్‌పోర్టులో చిన్న చిన్న కాంట్రాక్ట్ పనులు చేసుకునే రాపేటి గోవిందరావు ప్రతి రోజూ ఇదే దారిన వెళ్తూ చాలా కాలం ఈ విగ్రహం అసంపూర్తిగా నిలిచిపోయిన విషయాన్ని గమనించారు. వెంటనే ఆలయ కమిటీ గురించి తెలుసుకుని, విగ్రహ నిర్మాణ విషయంలో ముందుకొచ్చారు. ఇదే సమయంలో నడిమింటి సీతారామారావు కూడా ముందుకొచ్చి తన కుటుంబ సభ్యుల నుంచి సహాయ సహకారాలు అందజేస్తానని, వెంటనే ప్రారంభించాలని తెలియజేయడంతో 1994లో తిరిగి విగ్రహ నిర్మాణాన్ని పునఃప్రారంభించారు. విగ్రహం, ఆలయ పూర్తి నిర్మాణం, ప్రతిష్టలు మార్చి 7, 1996లో జరిగాయి.

అంతా ఆంజనేయ స్వామి దయ



నేను స్వతహాగా హనుమంతుడి భక్తుడిని. 1994లో తాటిచెట్లపాలెంలో భారీ ఆంజనేయ స్వామి విగ్రహ నిర్మాణం అసంపూర్తిగా ఉండటాన్ని గమనించి వెంటనే ఆలయ కమిటీని సంప్రదించాను. గుడి నిర్మాణం పూర్తి చేసేందుకు సహకరిస్తానని వారిని ఒప్పించాను. ఈ విషయంలో ఆళ్ల మధుసూదన నరసింగరావు ప్రధాన పాత్ర పోషించారు. 1995లో నాతో పాటు నడిమింటి సీతారామారావు) కూడా కలిసి రావడంతో ఆలయ పునర్నిర్మాణ బాధ్యతను మేమిద్దరం తీసుకుని, పూర్తిచేశాం.

– రాపేటి గోవింద్, ఆలయ ధర్మకర్త

ముస్తాబైన యోగసిద్ధాంజనేయుడి ఆలయం



విద్యుద్దీప కాంతుల్లో యోగసిద్ధాంజనేయ స్వామి ఆలయం

తాటిచెట్లపాలెం: జాతీయ రహదారి సూర్యానగర్‌లో వెలసిన యోగసిద్ధాంజనేయ స్వామి ఆలయం హనుమజ్జయంతి వేడుకలకు ముస్తాబైంది. ఆలయ వ్యవస్థాపకుడు పెనుమత్స సుబ్బరాజు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహిస్తున్నారు. రెండో రోజు ఆలయ అర్చకుడు శ్రీకాంత్ ఆచార్యుల బృందం శ్రీ పాంచరాత్ర ఆగమ సంప్రదాయాలతో మంగళధ్వని వేదమంత్రాలతో స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం, అష్టోత్తర శతకలశ స్నపనం, అర్చన, తీర్థగోష్టి, ప్రసాద వితరణ చేశారు. అనంతరం భక్తులచే సామూహిక సుందరకాండ పారాయణం గావించారు. హనుమజ్జయంతి సందర్భంగా ఆదివారం ఉదయం 9 గంటలకు ఆలయంలో లోక కల్యాణార్థం శ్రీసీతారామ కల్యాణ మహోత్సవం, అనంతరం మహా అన్నసమారాధన జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు.